బెల్లంపల్లిలో నీటి కటకట

- సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో సమస్య
- మోటర్ల మరమ్మతులో నిర్లక్ష్యం
- గోదావరి నీటి స్థిరీకరణలో అలసత్వం
- కార్మికుల వాడలకే ప్రాధాన్యం


రామాలయం ఫిల్టర్ బెడ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి కార్మిక కాలనీల్లో తాగునీటి ఎద్దడి తీవ్రమైన సమస్యగా మారింది. శాంతిఖని భూగర్భ నీటిని లాంగ్‌వాల్ ప్రభావిత గ్రామాలకు మళ్లించడం, పంపులు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం వల్ల నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి కార్మిక, కార్మికేతర కుటుంబాలను వేసవి కాలంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సింగరేణి అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్లంపల్లి సింగరేణి కాలనీల్లో నీటి ఎద్దడి కార్మిక కుటుంబాలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. సింగరేణి అధికారులు పంపుల మరమ్మతులను వేగవంతం చేయించడం, గోదావరి నీటి సరఫరాను స్థిరీకరించడం, సమాన సరఫరా విధానాన్ని అమలు చేయడంలో విఫలమవుతున్నారు. దీంతో కార్మికులు, కార్మికేతర కుటుంబాలు తాగునీటికి తండ్లాడుతున్నాయి.

అసమాన నీటి సరఫరా..కాలనీల్లో అసంతృప్తి

ప్రస్తుతం, ఎక్కువ మంది కార్మికులు నివసించే కాలనీలకు నీటి సరఫరాలో ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తక్కువ మంది కార్మికులు ఉన్న కాలనీలకు వారానికి ఒకసారి మాత్రమే నీటిని అతి కష్టంగా సరఫరా చేస్తున్నారు. దీంతో కార్మిక కుటుంబాలు దైనందిన అవసరాలకు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. మండు వేసవిలో నీటి సమస్య తీవ్రమవడంతో నివాసితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఫిల్టర్ బెడ్‌లలో నీటి కొరత..

సింగరేణి యాజమాన్యం కార్మిక కాలనీలకు నీటి సరఫరా కోసం ఫిల్టర్ బెడ్‌లను నిర్మించింది. శాంతిఖని భూగర్భం నుంచి పైప్‌లైన్ ద్వారా తీసుకొచ్చిన నీటిని ఫిల్టర్ బెడ్‌లలో శుద్ధి చేసి, రామాలయం ఫిల్టర్ బెడ్ ద్వారా 126వాల్వ్‌ల ద్వారా కాలనీలకు సరఫరా చేస్తారు. అయితే, గత కొన్ని వారాలుగా ఫిల్టర్ బెడ్‌లకు తగినంత నీరు అందడం లేదు. రెండు రోజులకు ఒకసారి మాత్రమే బెడ్‌లు నిండుతుండటంతో సరఫరా అస్థిరంగా ఉంది.

సమస్యకు కారణాలు

శాంతిఖని గని నుంచి వచ్చే నీటిలో 75% ఫిల్టర్ బెడ్‌లకు, 25%లింగాపూర్ చెరువుకు మళ్లించేవారు. అయితే వేసవి కారణంగా నీటి డిమాండ్ పెరగడం, శాంతిఖని గనిని లాంగ్‌వాల్ ప్రాజెక్టుగా మార్చేందుకు ప్రభావిత గ్రామాలకు నీటిని మళ్లించడం వల్ల సమస్య తలెత్తింది. ఎనిమిది పంపులలో నాలుగు మాత్రమే పనిచేస్తుండగా, మిగిలినవి మరమ్మతులో ఉండటం కూడా నీటి కొరతకు కారణమైంది.

గోదావరి నీటి సరఫరా అస్థిరం..

శాంతిఖని నీటితో పాటు, మందమర్రి ఫిల్టర్ బెడ్ నుంచి బెల్లంపల్లికి సరఫరా అయ్యే గోదావరి జలాలు కూడా అస్థిరంగా ఉన్నాయి. ఈ అరకొర సరఫరా కార్మిక కుటుంబాలను మరింత ఇబ్బంది పెడుతోంది. సింగరేణి అధికారులు, కార్మిక సంఘాలు సమస్య పరిష్కారంపై తగిన శ్రద్ధ చూపకపోవడంపై నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వారంరోజులకోసారి నీళ్లత్తన్నయ్



మున్పటి లెక్క సింగరేణి నీళ్లత్త లేవ్. మున్పు వారంల మూడు దినాలు నీళ్లిడిసేటోళ్లు. ఈ మధ్య ఏమైందో ఏమో గానీ వారం రోజులకోసారి నీళ్లత్తన్నయ్. గట్ల జేయబట్టి నీళ్ల కోసం మస్తు తక్లీబైతంది. నీళ్ల కష్టాలు తీర్చడానికి బోరింగ్‌కు పంపు మోటారు పెట్టి, చిలుము నీళ్లతోని నీటి అవసరాలు తీర్చుకుంటున్నం. గా బోరింగ్‌లు లేకపోతే మాకు ఇంకింత నీళ్ల కష్టాలు ఉండేటియ్. సింగరేణోళ్లు ఇసారం జేసి మున్పటి లెక్క నీళ్లిచ్చి ఆదుకోవాలే.

– ఖతిజా, టేకుల బస్తీ

నీళ్ల సమస్య నా దృష్టికి రాలేదు

ప్రస్తుతం నీళ్ల సమస్య ఏమి లేదు. ఈ సమస్య ఇంతవరకు నా దృష్టికి రాలేదు. ఎండాకాలం కావడంతో సహజంగానే భూగర్భ జలాలు అడుగంటుతాయి. శాంతిఖని నీటిని రెండు పంపులద్వారా లింగాపూర్‌కు పంపిస్తున్నాం. మిగితా నీళ్లను ఫిల్టర్ బెడ్‌కు సరఫరా అవుతున్నాయి. నా దృష్టికైతే నీటి ఎద్దడి సమస్య రాలేదు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నీటి సరఫరా మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటాం.

– సంజయ్‌కుమార్ సిన్హా, శాంతి గని మేనేజర్

క్లుప్తంగా

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన వేసవి సెలవుల్లో పల్లెల్లో నిర్వహించే గ్రామాలకు తరలండి కార్యక్రమం మంగళవారం పాత మంచిర్యాలలో ముగిసింది. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అధ్యక్షుడు రెడ్డి చరణ్, రాజేశ్వర్, తిరుపతి, ప్రధాన కార్యదర్శి గణేశ్, పీవైఎల్ నాయకుడు మనోహర్, పీడీఎస్‌యూ నాయకులు వంశీ, మనోజ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఒకరి వీరంగం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయానికి మంగళవారం ఒక వ్యక్తి మద్యం సేవించి వచ్చి వీరంగం సృష్టించారు. నేరుగా కమిషనర్ చాంబర్‌కు వెళ్లగా, అక్కడ కమిషనర్ లేకపోవడంతో టౌన్‌ప్లానింగ్ విభాగానికి వెళ్లారు. అనంతరం కార్యాలయంలో గట్టిగా అరుస్తూ వీరంగం సృష్టించడంతో అడ్డుకున్న అటెండర్లపై చేయిచేసుకున్నాడు. పోలీసులు వచ్చి ఆ వ్యక్తిని కార్యాలయం నుంచి బయటకు పంపించారు.

భైరవుడికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో కొలువైన శ్రీ కాలభైరవస్వామిని మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను శాలువాతో సన్మానించి భూషణ్‌శర్మతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రుద్రభట్ల సంతోశ్, మాజీ సర్పంచ్ గాలి మధు, నాయకులు సాబీర్, శ్యాం పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ భవనం ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

జన్నారం: మండల కేంద్రంలో నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత్రికేయులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సయ్య, లింగన్న, పాత్రికేయులు, నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీ కార్యకర్త అంటూ తొలగించారు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల ప్రచారంలో తిరిగిన తనను బీజేపీ కార్యకర్త అంటూ ప్రభుత్వ పథకాల లబ్ధికి దూరం చేస్తున్నారని హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు చల్లూరి గౌరీదేవి ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామంలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలిగా సంఘ సభ్యులు ఎంపిక చేయగా.. స్థానిక కాంగ్రెస్ నాయకులు కొందరు తాను బీజేపీ కార్యకర్తనంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగింపజేశారని, కాంగ్రెస్ పార్టీ విధేయురాలికి అప్పగించారని పేర్కొంది. ఇందిరమ్మ ఇళ్ల జాబితా నుంచి కూడా తన పేరు తొలగించారని తెలిపింది. తాను బీజేపీ కార్యకర్తను కాదని, ఆ పార్టీలో సభ్యత్వం కూడా లేదని తెలిపింది. బుధవారం జరిగే ఐకేపీ సమావేశంలో అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని, ఇందిరమ్మ ఇంటిని ఇప్పించాలని వేడుకుంటోంది.

'అధికారులు వేధిస్తున్నారు'

మంచిర్యాలటౌన్: నాలుగేళ్లుగా మంచిర్యాల కమిషనర్ వద్ద కారు డ్రైవర్‌గా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తనను కొందరు కార్మిక సంఘ నాయకులు ఫిర్యాదుల పేరిట ఇబ్బందులకు గురిచేయగా, శానిటరీ విభాగం అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని పారిశుధ్య కార్మికుడు సాయికిరణ్ ఆరోపించారు. వేధింపులతో తీవ్ర అస్వస్థతకు గురైన సాయికిరణ్‌ను వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తనను కమిషనర్ డ్రైవర్ విధుల నుంచి తొలగించారని, చెత్తను తరలించే ట్రాలీ డ్రైవర్‌గా విధులను కేటాయించారన్నారు. మానసికంగా ఇబ్బందులకు గురిచేయడంతోనే అనారోగ్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్


నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

చెన్నూర్‌రూరల్: నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. మండలంలోని కిష్టంపేట, కత్తెరసాల, అంగ్రాజ్‌పల్లి, దుగ్నెపల్లి, సుందరసాల గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులకు నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. టార్పాలిన్లు, గోనె సంచులు అవసరం మేరకు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతులకు రశీదు ఇవ్వాలని, రైతుల వివరాలు, ధాన్యం వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం కేటాయించిన ప్రకారం ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు.

తూకం వేసిన ధాన్యం రైస్‌మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ మోతీలాల్


ఆరెపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భీమారం: రైతుల వద్ద కొనుగోలు చేసి తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అధికారులను ఆదేశించారు. భీమారం మండలం ఆరెపల్లి ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువ రోజులు ధాన్యం కేంద్రాల్లో ఉంచొద్దని, అకాల వర్షాలు వస్తే తడిసి నష్టం వచ్చే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. ధాన్యం తరలింపునకు లారీలను పంపిస్తామని, వెంటనే రైసుమిల్లులకు తరలించాలని సూచించారు.

నర్సుల దినోత్సవంలో డ్యాన్స్‌లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..


డ్యాన్స్‌లపై విచారిస్తున్న డీసీహెచ్‌వో కోటేశ్వర్‌రావు

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నర్సుల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ ఛాంబర్‌లో డీజే సౌండ్ సిస్టమ్‌తో స్టెప్పులు వేయగా, మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి మంగళవారం డీసీహెచ్‌వో కోటేశ్వర్‌రావు విచారణ చేపట్టారు. రోగులకు వైద్య సేవలందించాల్సిన సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు, సిబ్బంది వేడుకల పేరుతో డ్యాన్స్‌లు చేయడమే కాకుండా ఈలలు వేస్తూ, కేరింతలు ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. విచారణ నిర్వహించిన ఛాంబర్‌లోకి విలేకరులను అనుమతించలేదు. ఈ విషయమై డీసీహెచ్‌వోను వివరణ కోరగా ఎన్క్వైరీ కోసం వచ్చినట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

'అడవులను నరికితే సహించం'


మాట్లాడుతున్న అటవీ సెక్షన్ అధికారి బేగ్

వేమనపల్లి: అటవీ భూముల్లోకి అక్రమంగా చొరబడి చెట్లను నరికితే సహించేది లేదని కుశ్నపల్లి అటవీ రేంజ్ అధికారి దయాకర్ అన్నారు. వేమనపల్లి మండలంలోని రాజారాం, మంగెనపల్లి, ఒడ్డుగూడం, ముక్కిడిగూడం, సుంపుటం గ్రామాల్లో మంగళవారం అటవీ భూముల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్వో ఎఫ్ఆర్ హక్కు పత్రాలు ఉన్న భూముల్లోనే సాగు చేసుకోవాలని, ఇతరులు సేద్యానికి పూనుకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. వన్యప్రాణుల వేట కోసం ఉచ్చులు పెట్టడం, విద్యుత్ తీగలు అమర్చడంలాంటివి చేస్తే వైల్డ్‌లైఫ్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ బేగ్, ఎఫ్‌బీఓ సోఫియా పాల్గొన్నారు.

కోటపల్లి: హక్కుపత్రాలు కలిగి ఉంటేనే పోడు భూములు సాగు చేయాలని ఎఫ్ఆర్వో సదానందం తెలిపారు. బోప్పారం, అన్నారం, ఎడగట్ట, ఎసన్‌వాయి గ్రామాల్లో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించి పోడు భూముల సాగుపై అవగాహన కల్పించారు. హక్కుపత్రాలు లేని వారు పోడు భూములను దున్నినా, సాగు చేసినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటవీశాఖ పరిధిలో ఉంటే భూముల్లో కొత్తగా సాగు చేసినా, చెట్లను నరికివేసినా అటవీచట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వన్యప్రాణులను వేటాడినా, విద్యుత్ తీగలు అమర్చినా నేరమని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో కరీం, శ్రీనివాస్, బీట్ అధికారులు రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోడు భూములపై అవగాహన

భీమిని: మండలంలోని కర్జిభీంపూర్ గ్రామంలో మంగళవారం పోడు భూములు, అటవీ సంరక్షణ ఆర్‌వోఎఫ్ఆర్ చట్టంపై ఫారెస్ట్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. తాండూర్ సెక్షన్ అధికారి సువర్ణ మాట్లాడుతూ.. అటవీ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారి గోపి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: అనర్హులైన పోడుదారులు కాస్తులో ఉన్న అటవీ భూములు స్వాధీనం చేసుకోనున్నట్లు డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్, రేంజ్ అధికారి పూర్ణచందర్ తెలిపారు. మండలంలోని వెంకటపూర్‌లో పోడుభూముల పట్టాలు లేని రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి


మందమర్రిరూరల్: మాట్లాడుతున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

బెల్లంపల్లి/పాతమంచిర్యాల/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల కార్మికులు సిద్ధం కావాలని కార్మిక వర్గాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బెల్లంపల్లిలో శాంతిఖని గనిపై సమ్మె ప్రచారంలో భాగంగా మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు కట్టుబానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హక్కులను రక్షించుకోవడం కోసం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు సంపూర్ణంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో, మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సివిల్ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో గేట్ మీటింగ్ నిర్వహించి దేశవ్యాప్త సమ్మెకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీకి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పి.రాజిరెడ్డి, సుదర్శన్, ఎండి చాంద్‌పాషా, టి.శ్రీనివాస్, ఎండి.జాఫర్, టి.మణిరాంసింగ్, ఎ.మహేందర్ జిల్లా కేంద్రంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టీ.శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు మంతెన మల్లన్న, జాఫర్, రామన్న, భగత్, రాజేష్, తిరుపతి, గణేశ్, అరుణ, మందమర్రిలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ కేంద్ర కమిటీ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, రామకృష్ణాపూర్‌లో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య, మిట్టపెల్లి పౌల్, హుస్సేన్, హరి రామకృష్ణ, శ్రీరాంపూర్‌లో జేఏసీ నాయకులు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజా రెడ్డి, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షులు కాంతయ్య, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సమ్మురాజయ్య, హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వేతనాలివ్వడం లేదని ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాతమంచిర్యాల: అనంత ఈ సొల్యూషన్ విద్యాంజలి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంస్థ ఉద్యోగులు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో, ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్, స్వీపర్, పీఈటీ, ఇంగ్లిష్ టీచర్ పని చేస్తున్నామని తమకు 8నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. తమకు వేతనాలు ఇప్పించాలని జిల్లా కలెక్టర్, టీటీడీవో, డీఈవో, ఐటీడీఏ పీవోకు వినతిపత్రాలు సమర్పించినా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనంత ఈ సొల్యూషన్, విద్యాంజలి 2.0సంస్థల ఉద్యోగులు, కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న కార్మికులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పాత మంచిర్యాలలోని విద్యుత్ ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం హైటెక్‌సిటీలోని విద్యుత్ భవన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐడీ కార్డులు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని కోరారు. ఇన్సూరెన్స్, ప్రమాదబీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు చిదం వెంకటేశ్, హమాలీ సంఘం నాయకులు సురేందర్, రాజేశ్వరి, చందు, సుధాకర్, అనిల్, అజయ్, ప్రవీణ్, రాజు, శ్రావణ్, సీఐటీయూ నాయకులు గంట నరేశ్, రాజమల్లు పాల్గొన్నారు.

భీమినిలో సామాజిక తనిఖీ

భీమిని: మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం భీమిని రైతువేదికలో నిర్వహించారు. 1 ఏప్రిల్ 2024 నుంచి 31మార్చి 2025వరకు రూ.4కోట్ల 80లక్షల ఖర్చుతో పలు రకాల పనులను చేసినట్లు అధికారులు వెల్లడించారు. పది బృందాలతో 12గ్రామ పంచాయతీల్లో డీఆర్‌పీలు, ఎస్ఆర్పీలు, వీఎస్‌లు పనులను తనిఖీ చేశారు. పలు అవకతవకలను గుర్తించారు. డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ.. పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్లక్ష్యం వహించిన వారికి రూ.8వేల జరిమానా విధించారు. రూ.12432 రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏపీడీ మాధవీలత, ఎంపీడీవో గంగామోహన్, అంబుడ్స్‌మెన్ శివరాం, విజిలెన్స్ అధికారులు కిరణ్, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందికి ప్రశంస

శ్రీరాంపూర్: దొంగతనాన్ని ఆదిలోనే అరికట్టిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బందిని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ అభినందించారు. ఇటీవల ఇందారం ఓపెన్ కాస్ట్ గని నుంచి రూ.80వేల విలువ చేసే కాపర్ కేబుల్ ను దొంగలు దోచుకోవడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో సెక్యూరిటీ సిబ్బంది చాకచక్యంగా పట్టుకొని స్వాధీనం చేసుకొని, నిందితులను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్‌లోని సెక్యూరిటీ కార్యాలయం వద్ద సెక్యూరిటీ సిబ్బంది బీ.వెంకటేష్, ఓ.తిరుపతి, శ్రీనివాస్, కమ్మ బాపులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన వేదికను ఈ సందర్భంగా జీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఓటుజీఎం సత్యనారా యణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఐఈడీ ఎస్ఈ కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ శంకరయ్య, ఇన్స్‌స్పెక్టర్లు రామ్‌రెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

జైపూర్: బక్రీద్ పండుగ నేపథ్యంలో జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో సబ్‌డివిజన్ పరిధిలోగల జంతు రవాణాదారులతో ఏసీపీ వెంకటేశ్వర్ సమావేశమై మాట్లాడారు. పశువైద్యాధికా రుల ఆదేశాల మేరకు నిబంధనలు అతిక్రమించి జంతు రవాణా చేస్తే, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్, శ్రీరాంపూర్, భీమారం ఎస్సైలు శ్రీధర్, సంతోష్, మానస ఉన్నారు.

లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న అడ్వకేట్ పార్వతీశం

మందమర్రిరూరల్: పని ప్రదేశాల్లో మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్, ఎక్స్‌టర్నల్ ప్యాకల్టీ, అడ్వకేట్ పార్వతీశం(విశాఖపట్నం) పేర్కొన్నారు. ఏరియా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం ఏరియా జీఎం దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాపు టూ క్రియేట్ అవేర్‌నెస్ సెక్సువల్ హరాష్‌మెంట్ ఆక్ట్ పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే సంబంధిత ఇంటర్నల్ కంప్‌లెయింట్స్ కమిటీ మెంబర్స్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిటీ సభ్యుల విచారణ అనంతరం వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో మహిళా ఉద్యోగులు ఎలాంటి అపోహలకు గురికాకుండా, స్వేచ్ఛగా విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, వీటీసీ మేనేజర్ శంకర్, ట్రైనింగ్ ఆఫీసర్ అశోక్, బెల్లంపల్లి, మందమర్రి ఇంటర్నల్ కంప్‌లెయింట్స్ కమిటీ మెంబర్స్ ఉన్నారు.

'బీజేపీతోనే దేశ ప్రజలకు రక్షణ'

మందమర్రిరూరల్: దేశ ప్రజలకు బీజేపీతోనే సంపూర్ణ రక్షణ ఉంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేశ్ అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మనదేశం ప్రపంచంలో ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. సమావేశంలో నాయకులు సంజీవరావు, రాయమల్లు, రవిసాగర్, మోహన్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి పరీక్షకు స్పందన

బెల్లంపల్లి: బజారు ఏరియాలోని శాంభవి ఐ విజన్ సెంటర్ ఆవరణలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించగా స్పందన లభించింది. శిబిరానికి 70మంది హాజరు కాగా కంటి వైద్య నిపుణుడు కె.అంజయ్య పరీక్షించారు.